క్లుప్తంగా

డీఐ వెంకటేశం బదిలీ

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ డీఐగా పనిచేస్తున్న బి. వెంకటేశం జగిద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యారు. వీఆర్ సైబరాబాద్ నుంచి ఎం. కొండల్‌రావు కూకట్‌పల్లి నూతన డీఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఓల్డ్ బోయిన్‌పల్లి : సాయి సాగర్ ఎన్‌క్లేవ్ కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ నాయకుడు ఎనుగుల తిరుపతి అన్నారు. శనివారం కాలనీ సమస్యలను తెలుసుకున్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు ఆస్కారం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనికి తోడు డ్రైనేజీలు నిండి రహదారుల్లో మురుగునీరు ప్రవాహిస్తుందని, సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సాయిసాగర్ ఎన్‌క్లేవ్ ప్రెసిడెంట్ భార్గవ్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో శనివారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ హిందీ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్


డాక్టర్ చందన, కళాశాల ప్రిన్సిపాల్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం కంప్యూటర్, బీఎస్సీ, లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్‌లలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్ తీసుకుంటున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. చందన శనివారం పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు కళాశాలలో రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని, ప్రభుత్వ నిబంధనల మేరకు స్పాట్ అడ్మిషన్స్ తీసుకున్న వారికి స్కాలర్‌షిప్ ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 8179561193, 9885531331 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పంచమి కాలనీలో సుమారు రూ.40 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్, గణేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

17న విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రతి యేటా నిర్వహించే విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించాలని బీజేపీ నాయకుడు ఎనుగుల తిరుపతి అన్నారు. శనివారం ఆయన ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ భవానీనగర్‌లోని వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన విశ్వకర్మ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. 17న జరిగే వేడుకలకు ఎంపీ రాజేందర్‌ను ఆహ్వానించేందుకు తగిన కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షుడు రమేష్ చారి, రామలింగచారి, సాయిచారి, హరిబాబు, ఉమాపతి, రవిశంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మ్యాన్‌హోళ్లు!

• నిత్యం పొంగుతున్న డ్రైనేజీలు • మంచినీటిలో మురుగు నీటి సరఫరా • శాశ్వత పరిష్కారం చూపని అధికారులు

అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాల మీదకు వస్తుంది. ఏళ్లు గడుస్తున్న.. కోట్లాది నిధులు కేటాయించినా డ్రైనేజీలు లీకేజీ అవుతూనే ఉన్నాయి. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతుండటంతో పాటు ప్రమాదకరంగా మారి ప్రజలకు ఇబ్బందులను తెచ్చిపెడుతూనే ఉన్నాయి. పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు ధ్వంసం కాగా మరికొన్ని కుంగిపోయి ఉన్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – ఓల్డ్ బోయిన్‌పల్లి


ఆర్ఆర్ నగర్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

డివిజన్‌లోని ఆయా కాలనీల్లో మ్యాన్‌హోళ్లు ధ్వంసం అయ్యాయి. శిథిలావస్థకు చేరి లీకేజీలతో మురుగు నీరు రోడ్లపై పారుతుంది. వైశ్యా బ్యాంక్ కాలనీ, హస్మత్‌పేట్, ఎల్‌బీనగర్, కోయబస్తీ, విఠల్ ఎన్‌క్లేవ్, ఆర్ఆర్‌నగర్, కళింగ ఎన్‌క్లేవ్, భవానీనగర్, బడేగూడ, ముస్లిం బస్తీ, అంజయ్యనగర్ వంటి పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల మూతలు పగిలాయి. కొన్నింటికి మూతలు లేక ప్రమాదకరంగా మారాయి. దీంతో నిత్యం మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లపై ఉన్న మ్యాన్‌హోల్స్ కుంగి ఉండటంతో వాహనదారులు ప్రమాదల బారిన పడుతున్నారు.

మంచినీటి సరఫరాలో మురుగు నీరు..

పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను కట్టడి చెయ్యని అధికారులకు మరో సమస్య చుట్టు ముడుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆయా కాలనీల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో మురుగు నీరు కలిసి సరఫరా అవుతుంది. ఈ విషయంపై అధికారులకు సమాచారం ఇస్తే 'చూస్తాం.. చేస్తాం' అంటూ కాలం వెల్లదీస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

ఫిర్యాదుల్లో డ్రైనేజీలపైనే అధికం

ఇటీవల కాలంలో డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలపైనే ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. కార్పొరేటర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించినపుడు డ్రైనేజీ లీకేజీలు, రోడ్లపై మురుగు పారడం, కుంగిన మ్యాన్‌హోల్స్‌పై ఫిర్యాదులు వచ్చాయి. నెలల తరబడి మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నా అధికారులు సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రమాదకరంగా మారిన వాటి స్థానంలో కొత్తగా వేస్తున్న మ్యాన్‌హోల్స్ కూడా ధ్వంసం అవుతున్నాయంటే వాటి నాణ్యత ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందిస్తున్నాం



ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి మ్యాన్‌హోల్స్‌ను బాగు చేయిస్తున్నాం. పగిలిపోయిన వాటి స్థానంలో కొత్త మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో కలుషిత నీళ్లు కలవకుండా తగిన చర్యలు తీసుకుంటాం. కొన్ని ప్రాంతాల్లో ఏళ్ల కాలం నాటి పైపులైన్ల ద్వారా కూడా మురుగు నీరు కలుస్తుంది.
– యాదగిరి, వాటర్ వర్క్స్ మేనేజర్, ఓల్డ్ బోయిన్‌పల్లి


అంజయ్యనగర్ మెయిన్ రోడ్డులో శిథిలమైన మ్యాన్‌హోల్


అంజయ్యనగర్‌లో మ్యాన్‌హోల్ లీకేజీ


కుంగిన మ్యాన్‌హోల్

వైద్య శిబిరానికి విశేష స్పందన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: మూసాపేటలో చిత్తారమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ పారడైజ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 500 మందికి ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు చేశారు. ప్రముఖ వైద్యులు, నిపుణులు సమాజానికి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి మార్గదర్శకులైన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. విద్యారంగానికి విశేష సేవలందించిన గురువులను లయన్స్ క్లబ్ నాయకులు సత్కరించారు. కార్పొరేటర్ శిరీష బాబూరావు, కోడిచర్ల మహేందర్, లయన్స్ క్లబ్ జిల్లా 320 హెచ్ గవర్నర్ గంపా నాగేశ్వరరావు, లయన్ మనోహర్ రెడ్డి, కల్లూరి శ్రీనివాస్, రీజియన్ చైర్‌పర్సన్ టి.టి. రెడ్డి, ఎంఎస్ ప్రకాష్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ పారడైజ్ అధ్యక్షులు చంద్రమోహన్ నరేసేపల్లి, కాసం శ్రీనివాస్, ప్రాజెక్టు చైర్మన్ శ్రీధర్ చందన్, ప్రాజెక్ట్ కో చైర్మన్ రమేష్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కూకట్‌పల్లి: సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం 46 మంది లబ్ధిదారులకు 16 లక్షల 3 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్స చేయించుకొని డబ్బులు చెల్లించలేని నిరుపేదలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరంతరం కొనసాగుతుందన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

క్యూ డాట్ అబ్లేషన్‌తో కార్డియాలజీ శస్త్ర చికిత్స సులభం

ఆల్విన్‌కాలనీ: కార్డియాలజీ రంగంలో కూకట్‌పల్లి శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ ఆట్రియల్ ఫైబ్రిలేషన్ చికిత్స కోసం అత్యాధునిక ఆల్ట్రా ఫాస్ట్ క్యూ డాట్ అబ్లేషన్ టెక్నాలజీని విజయవంతంగా ప్రవేశపెట్టింది. కూకట్‌పల్లి సర్కిల్ నిజాంపేట్ రోడ్డులోని హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ డాక్టర్ వి.ఎస్. రామచంద్ర తెలిపారు. కార్డియాలజీ శస్త్ర చికిత్స విధానంలో భారతదేశంలోనే తొలిసారిగా విప్లవాత్మక చికిత్స విధానం అమలు చేసినట్లు పేర్కొన్నారు. హాస్పిటల్‌లో ఇప్పటి వరకు ఏడుగురు రోగులకు క్యూ డాట్ అబ్లేషన్ విధానంతో ఈ సాంకేతికతతో కార్డియాలజీ శస్త్ర చికిత్స సులభంగా విజయవంతంగా చేశామన్నారు. ఈ విధానం ద్వారా రోగి తక్కువ ఒత్తిడి, తక్కువ ప్రమాదం, వేగవంతంగా కోలుకోవడం జరుగుతుందని తెలిపారు. రోగుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందించడమే హోలిస్టిక్ లక్ష్యం అని పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ నవీన్, డా. బిజ్జు గోవింద్, ప్రొఫెసర్, డాక్టర్ అపర్ణ కామరాజు, వెంకటలక్ష్మీ నరసింహారావు, డాక్టర్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.


క్యూ డాట్ అబ్లేషన్ టెక్నాలజీ వివరిస్తున్న వైద్యులు

అవసరమైన చోట భూగర్భ డ్రైనేజీ నిర్మాణం

మోతీనగర్: అవసరమైన చోట భూగర్భ డ్రైనేజీ నిర్మించడానికి కృషి చేస్తామని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని అల్లాపూర్ జేకే పాయింట్, కడిచూర్ గల్లీలో, గాయత్రినగర్ 60 ఫీట్ రోడ్డు, హరిహర టెంపుల్ ఎదురుగా, తులసినగర్ ప్రాంతాల్లో శ జలమండలి అధికారులు, గాయత్రినగర్ మేనేజర్ అన్వేత్‌తో కలిసి బస్తీలో పర్యటించారు. అవసరమైన చోట భూగర్భ డ్రైనేజీ పనుల కోసం ఎస్టిమేషన్ కోసం పరిశీలన జరిపామని తెలిపారు. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో ఇప్పటికే డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులు, సమస్యలు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో సయ్యద్ నజీర్, కృష్ణారావు, నూర్‌ఖాన్, బంగారు, జ్ఞానేశ్వర్, సంపత్‌రెడ్డి, సాంబయ్య, సంజీవ్‌రెడ్డి, కాశీనాథ్, వెంకటేశ్వర్లు, సూరిబాబు, రాములు, యోగిరాజు, సత్యమ్మ, పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.


జలమండలి అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

పేకాడుతున్న 8 మంది అరెస్టు

మూసాపేట: పేకాడుతున్న 8 మందిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని సహృదయ అపార్టుమెంట్‌లో 8 మంది 3 కార్డు గేమ్ ఆడుతున్నారు. పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి వారిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.55, 670 నగదు, 8 ఫోన్‌లు, 3 సెట్ల కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశ పురోగతికి యువత సహకారం అందించాలి


విద్యార్థులతో ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు, ఫ్యాకల్టీ ప్రతినిధులు

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: దేశ పురోగతికి యువత తమ వంతు సహకారం అందించాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా.రామేశ్వరరావు సూచించారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్‌లోని చాణక్య సెమినార్ హాల్‌లో శనివారం పీజీ విద్యార్థులు 2023–25 బ్యాచ్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేయడం, నిజాయితీ, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జ్ఞాపకాలు, అనుభవాలు పంచుకున్నారు. అనంతరం నిర్వహించిన ఆటాపాట, సంగీత కార్యక్రమాలతో అదుర్స్ అనిపించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ పూర్వ విద్యార్థికి ప్రతిష్టాత్మక ఫెలోషిప్


గణేష్ పుత్తూర్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థికి ప్రతిష్టాత్మక ఫెలోషిప్ మంజూరు అయింది. హెచ్‌సీయూలో 2018–20 బ్యాచ్ ఎంఏ హిస్టరీ పూర్వ విద్యార్థి గణేష్ పుత్తూర్‌కు బెంగళూరులోని ఫౌండేషన్ ఫర్ ఇండియన్ హిస్టారికల్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ద్వారా స్థాపించబడిన ప్రతిష్టాత్మక సర్ జాదునాథ్ సర్కార్ ఫెలోషిప్ ఫర్ ఇండియన్ హిస్టరీ లభించింది. ఈ ఫెలోషిప్ కింద రూ.15 లక్షల గ్రాంట్‌ను అందిస్తారు. భారతీయ చరిత్రలో పరిశోధన, రచనలు ప్రోత్సహించడానికి ఈ ఫెలోషిప్ రూపొందించబడింది. కాగా గణేష్‌ను హెచ్‌సీయూ హిస్టరీ విభాగం ఫ్యాకల్టీ, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

ఆస్పత్రి నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక చనిపోతున్నా!

• ఓ విలేకరికి మెసేజ్ పంపి వ్యక్తి అదృశ్యం
• పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య


సత్యనారాయణ

కేపీహెచ్‌బీకాలనీ: గతంలో పనిచేసిన ఆస్పత్రి నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక చనిపోతున్నట్లు ఓ విలేకరికి మెసేజ్ పంపి అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ధర్మారెడ్డికాలనీ ఫేజ్ 2లో నివాసం ఉండే దుస్స సత్యనారాయణ (39) ఈ నెల 11న చెన్నైలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్తున్నట్లు భార్య రమకు చెప్పి వెళ్లాడు. విజయవాడ మీదుగా చెన్నైకి వెళ్తున్నట్లు చెప్పిన ఆయన ఈ నెల 12న ఉదయం 8 గంటలకు తాను చెన్నై చేరుకున్నట్లు సమాచారం ఇచ్చాడు. తరువాత అతని మొబైల్ స్విచ్ఛాఫ్ వచ్చింది. శనివారం ఉదయం 6 గంటలకు కూకట్‌పల్లిలో స్థానికంగా ఉండే ఓ విలేకరికి 'తాను గతంలో పనిచేసిన మాదాపూర్‌లోని సింధు ఆస్పత్రి నిర్వాహకుల వేధింపులను తట్టుకోలేక చనిపోతున్నానని, తన కుటుంబాన్ని కాపాడాలని' మెసేజ్ పంపాడు. సింధు ఆస్పత్రిలో తాను సెక్యూరిటీ ఇన్‌ఛార్జిగా పనిచేసినప్పుడు తనతో పాటు మరికొందరిపై దొంగతనం మోపి కేసు పెట్టారని, తాను అక్కడ ఉద్యోగం వదిలేసి వేరే చోట ఉద్యోగంలో చేరేందుకు ప్రయత్నిస్తే తప్పుడు ఆరోపణలతో ఉద్యోగం రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ గత సంఘటనలతో కూడిన లేఖను వాట్సాప్ ద్వారా పంపాడు. సత్యనారాయణ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, చనిపోతున్నట్లు మెసేజ్ పంపడంతో తెలుసుకున్న అతడి భార్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఛాప్ -2025

మాదాపూర్: శిల్పారామంలో ఛాప్– 2025 ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. లెదర్‌బ్యాగ్స్, వుడ్ కార్వింగ్, పెయింటింగ్స్ ఉత్పత్తులు ఆకర్షణగా నిలుస్తున్నాయి. 24 క్యారెట్ గోల్డ్ రాజస్థాన్ పెయింటింగ్ ల్యాంప్ అందుబాటులో ఉంది. దీని ధర 35వేలు. స్టోరేజ్ బాక్సులు, పండ్ల బుట్టలు, చపాతీ బాక్సు, టేబుల్‌మ్యాట్ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. ఆత్మకల్ప ఇంసెంబ్లీ, దేవి గిరిష్‌చంద్ర శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో రంగపూజ, గణేశస్తుతి, కృష్ణశబ్దం, నటేశకౌతం, బృందావన నిలయే, శివాష్టకం, దశావతారశబ్దం, ధనశ్రీ తిల్లాన తదితర అంశాలను కళాకారులు ఆత్మిక, గిరీష్‌చంద్ర, సహస్రదేవి, భవిష్య, తన్వి, కమలిక, స్నేహిక తదితరులు ప్రదర్శించారు.











బ్యాండ్ కొట్టేందుకు వచ్చిన వ్యక్తి అదృశ్యం


దొడ్ల లింగయ్య (ఫైల్)

మూసాపేట: వినాయక నిమజ్జన ఉత్సవాల్లో బ్యాండ్ కొట్టేందుకు వచ్చిన ఓ వ్యక్తి తప్పిపోయిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం...వికారాబాద్ జిల్లా కొండాపూర్ గ్రామానికి చెందిన దొడ్ల లింగయ్య (45) ఈ నెల 2న బ్యాండ్ కొట్టేందుకు గ్రూపులో వచ్చాడు. వినాయక ఉత్సవాలు ముగిసిన తరువాత 7న మధ్యాహ్నం సొంత ఊరుకు బయలుదేరాడు. ఇన్ని రోజులకు కూడా ఊరికి రాకపోవడం, బంధువుల వద్ద ఆరా తీసినా సమాచారం లభించలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ ఫిట్‌నెస్ స్టూడియో ప్రారంభం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ చౌరస్తాలో గుడ్‌విల్ హోటల్‌పైన బెల్ ఫిట్‌నెస్ స్టూడియోని పీఏసీ చైర్మన్ గాంధీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, జగద్గిరిగుట్ట సీఐ నరసింహతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఒక గంట వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు.

ఎల్‌వోసీ అందజేత



మోతీనగర్: శ్రీ వివేకానందనగర్ నివాసి మారబోయిన సత్తయ్యకు వీ టీం ప్రెసిడెంట్ దేవరింటి మస్తాన్‌రెడ్డి శుక్రవారం ఎల్‌వోసీ అందజేశారు. కార్యక్రమంలో వీ టీమ్ ప్రధాన కార్యదర్శి రవీందర్ ముదిరాజ్, ట్రెజరర్ ఆదినారాయణ, సతీష్ రెడ్డి, బొంత రవి తదితరులు పాల్గొన్నారు.